మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

పోస్టర్ విడుదల చేస్తున్న దాసరి ఉష, బీఆర్ఎస్ నాయకులు

వృక్షార్చనను విజయవంతం చేయాలి

- 17న ఘనంగా తొలి సీఎంకేసీఆర్ జన్మదిన వేడుకలు
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, ఫిబ్రవరి15: తెలంగాణ తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ఈనెల 17న నిర్వహించనున్న వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన మొక్క నాటి, ముందస్తుగా కేసీఆర్ జన్మదిన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడారు. ఉద్యమ నేత, రాష్ట్ర సాధకులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ నిర్వహిస్తున్న వృక్షార్చణ కార్యక్రమంలో నియోజక వర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పాల్గొని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టి ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ బాలాజీ రావు, బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, నాయకులు వెన్నం రవీందర్, శ్రీనివాస్, పల్లె మధు, బొంకూరి నిఖిల్, బొంకూరి అఖిల్, రేండ్ల నాగరాజు, కుక్క మనోజ్, కొమ్మరాజుల సతీశ్ పాల్గొన్నారు.

నూరేళ్లు సంతోషంగా జీవించాలి

తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ ఆది నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పేర్కొన్నారు. ఈ నెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా చేపట్టే వృక్షార్చన పోస్టర్‌ను పెద్దపల్లి జెండా చౌరస్తాలో శనివారం ఆమె విడుదల చేశారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈనెల 17న 101 మొక్కలు నాటుతామని తెలిపారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ నెల పచ్చటి వనాలతో పులకించి పోగా, నేటి రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ వెలవెలవెలబోతున్నదని విమర్శించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ పెద్దపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాగృతి నాయకుడు మనోజ్, బీఆర్ఎస్ నాయకులు భూమేశ్, అంబోజు నాగరాజు, చిట్టవేని వినీత్, నర్ల సాయి, శ్రీనివాస్, రాజేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానల ప్రారంభమెప్పుడో?

జూలపల్లిలో నిర్మించిన పల్లె దవాఖాన భవనం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 12: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానలుగా మార్చింది. ఇందుకోసం భవన నిర్మాణాలు చేపట్టడానికి నిధులు కేటాయించింది. భవన నిర్మాణాలు పూర్తయి పనులు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పల్లె దవాఖానలను ప్రారంభించడం లేదు.

కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కమాన్‌పూర్‌తో పాటు జూలపల్లి, పేరపల్లి, రొంపికుంటలో ఉన్నాయి. రొంపికుంట ఆరోగ్య ఉప కేంద్రం పక్కా భవనంలో కొనసాగుతుండగా, జూలపల్లి ఆరోగ్య ఉప కేంద్రం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో కొనసాగున్నది.ట. పేరపల్లి, కమాన్‌పూర్‌లోని కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు.

జూలపల్లి, పేరపల్లి గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానలుగా మార్చారు. ఈ నేపథ్యంలో ఒక్కో పల్లె దవాఖాన భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 16 లక్షలు మంజూరు చేసింది. ఈ రెండు గ్రామాల్లో పల్లె దవాఖానల భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండు చోట్ల నిర్మించిన పల్లె దవాఖానల్లో విద్యుత్, నీటి సౌకర్యం లేదన్న కారణాలతో వైద్య సిబ్బంది వాటిని తీసుకోకపోవడంతో ప్రజలు వైద్య సేవలు అందడం లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాదికి పైగా గడుస్తున్నా ఈ పల్లె దవాఖానలను వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పల్లె దవాఖానలు ప్రారంభానికి నోచుకోకపోవడమే ఇందుకు నిదర్శనమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి పల్లె దవాఖానలను వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో సేవలు ప్రారంభిస్తాం..!

జూలపల్లి, పేరపల్లిలోని నూతన పల్లె దవాఖాన భవనాలను ప్రారంభించలేదు. ఈ భవనాల్లో కరెంట్, నీటి సౌకర్యం లేదు. వాటిని కాంట్రాక్టర్ వైద్యశాఖకు అప్పగించలేదు. త్వరలో పల్లె దవాఖానా కొత్త భవనాల్లో వైద్య సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం. జూలపల్లిలో పల్లె దవాఖాన డాక్టర్‌ను మరో చోటికి బదిలీ కావడంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. త్వరలోనే డాక్టర్‌ను కూడా నియమిస్తాం.

-అన్న ప్రసన్న కుమారి, డీఎంహెచ్‌వో

ప్రతి విద్యార్థికి ఏపీఏఆర్ నంబర్ కేటాయించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఫిబ్రవరి 15: ప్రతి విద్యార్థికి ఏపీఏఆర్ నంబర్ జనరేట్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏపీఏఆర్ నంబర్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఆర్) నంబర్ ద్వారా విద్యార్థులకు సంబంధించిన విద్యార్హత సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో భద్రపర్చనున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి విద్యార్థికి ఏపీఏఆర్ నంబర్ జనరేట్ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 54 శాతం విద్యార్థులకు ఏపీఏఆర్ నంబర్ జనరేట్ చేశామని, మరో 3 రోజులలో 75 శాతానికి చేరేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలో దేశ భవిష్యత్తు

- ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి
- ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

డిగ్రీ పట్టా అందజేస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లి, ఫిబ్రవరి15: దేశ భవిష్యత్తు, పురోగతి యువత చేతిలో ఉందని ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ దాసరి దాసరి ప్రశాంత్ రెడ్డి, హైదరాబాద్ జేఎన్టీయూ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగ అధిపతి, ఆచార్య డాక్టర్ ఉమారాణి హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువత దేశం కోసం పనిచేయాలని, డిగ్రీ పట్టా చేతికి అందడంతో ఎవరికి వారే మార్గదర్శకులుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన పతకాలు, ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంజినీరింగ్ పట్టాలు ప్రధానం చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణి గణేశ్ , ఈవో సురేశ్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ, డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరిఫ్, స్వాతి, ప్రభాకర్, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ అంబికా పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

హాజరైన అధికారులు

పెద్దపల్లి, ఫిబ్రవరి15: జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ నియంత్రణకు చేపట్టిన చర్యలపై కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మత్తు పదార్థాల వాడకం నియంత్రణ చర్యలు, నివారణకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈమేరకు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి, పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని దవాఖానలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన వారికి అక్కడ చికిత్స అందించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన, బర్డ్ ఫ్లూ పై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, జిల్లా అటవీ అధికారి సీహెచ్ శివయ్య, జిల్లా ఆ బ్కారి శాఖ అధికారి మహిపాల్ రెడ్డి, డీఏవో దోమ ఆదిరెడ్డి, అర్టీవో రంగారావు, డీపీవో వీరబుచ్చ య్య, డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాశ్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీ సందర్శన

గోదావరిఖని, ఫిబ్రవరి 15: జీడీకే 1 సీహెచ్‌పీని శుక్రవారం సింగరేణి ఆపరేషన్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ సందర్శించారు.బొగ్గు ఉత్పత్తి, రవాణాను తెలుసుకున్న డైరెక్టర్ సీహెచ్‌పీలో సీ1, 2,3 పని ప్రదేశాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్య సాధనకు ఉద్యోగులు సమష్టిగా కృషి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సూచించారు. ఇక్కడ ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, క్వాలిటీ జీఎం బైద్య, ఎస్‌వోటూ జీఎం గోపాల్ సింగ్, రమేశ్, హరీశ్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకులు బండి మల్లేశం, బుడిమ సమ్మయ్య, కే లక్ష్మయ్య, పిట్ కమిటీ, మైన్స్ కమిటీ సభ్యులు, ఐఎన్టీయూసీ నాయకులు బత్తుల పోచయ్య, మల్లికార్జునస్వామి, పుట్ట రమేశ్, దామోదర్ ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 15 : ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో శనివారం ఆయన పర్యటించారు. మున్సిపల్ సిబ్బందితో చెత్తాచెదారం తీయించారు. సుల్తానాబాద్ స్వచ్ఛ మున్సిపాలిటీగా ఉంచేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అంతర్గాం, ఫిబ్రవరి 15: బాలికలకు మైనార్టీ తీరక ముందే వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్ తెలిపారు. మద్దిర్యాల గ్రామానికి చెందిన ఓ బాలికకు వివాహం చేస్తున్న విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి తహసీల్దార్ కార్యాయంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అమ్మాయిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. 18 ఏళ్లు నిండకుండా వివాహం జరిపించ వద్దని కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐ సమక్షంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్, ప్రొటక్షన్ ఆఫీసర్ కనకరాజు, టీసీపీయూ టీం మెంబర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ఎలిగేడు పిబ్రవరి 15 : మండల కేంద్రంలో నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్షనపెల్లి నర్సింగారావు స్మారక ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే తన వంతుగా 50వేల విరాళాన్ని ప్రకటించారు. నా నేస్తం గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ నా నేస్తం ట్రస్ట్ తమ బాధ్యతగా నాన్న పేరు మీద కంప్యూటర్ శిక్షణాకేంద్రం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ ,ప్రదాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ,మాజీ అధ్యక్షులు పెంట శ్రీనివాసరావు,సబ్బులు శ్రీనివాస్,సత్యం రమేశ్, నాయకులు సామ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసైన్స్ ఆఫ్ విన్నింగ్ పుస్తక ఆవిష్కరణ

మంథని రూరల్, ఫిబ్రవరి 15: ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్ దొమ్మటి రవి రచించిన దసైన్స్ ఆఫ్ విన్నింగ్ పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫిరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ కార్యక్రమంలో ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, లక్ష్మీకాంత రాథోడ్, అంతర్జాతీయ ఫిజికల్ ఎడ్యుకేషన్ నిపుణులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యార్థికి రాష్ట్ర స్థాయి ర్యాంక్

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పెద్దపల్లి, ఫిబ్రవరి15: ఇటీవల శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్‌లో గాయత్రి విద్యార్థి భూక్యా జశ్వంత్ (4వ తరగతి) రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంక్ సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించిన బూక్యా జశ్వంత్‌తో పాటు, భావన, ఆద్య (4వ తరగతి) జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్ , జంగపల్లి సాత్విక (8వ తరగతి), ఏ సాత్విక్ తేజ (6వ తరగతి) జిల్లా స్థాయి కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు శనివారం హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అవార్డులు అందజేశారని వివరించారు. విద్యార్థులను ప్రోత్సహించి, ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేసిన మ్యాథ్స్ టీచర్ రజియొద్దీన్‌ను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రజినీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రదర్శన

ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 15: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సరిపడా పోలింగ్ కేంద్రాలు, ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎంతమంది ఓటర్లు అనే అంశంలో ఈనెల 11 నుంచి కసరత్తు చేసిన అధికారులు మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో 50,994 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. మండలంలో 92 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 554 మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా జాబితాను సిద్ధం చేసి తుది జాబితాను పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ రమణ, ఉపాధి హామీ ఏపీవో రమేష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్ బొంగోని వెంకటేష్‌గౌడ్, సిబ్బంది సుజాత, ప్రశాంత్, శ్రీరామ్, రవి, సౌజన్య, సుజన్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15 : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 15,18వ డివిజన్‌లలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, నగరపాలక కమిషనర్ జే అరుణశ్రీ పర్యటించారు. శనివారం కార్పొరేషన్ సిబ్బందితో కలిసి 15వ డివిజన్ ఎస్టీ కాలనీలో మురుగునీరు సాపీగా సాగేలా, భూగర్భ నీటి కుండీలను నిర్మించాలని సూచించారు. 8వ డివిజన్ హనుమాన్‌నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. డెయిలీ మార్కెట్‌ను ఉపయోగంలోకి తేవాలన్నారు. పారిశుధ్య పనులు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఇఇ రామన్, శానిటరీ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, నాగభూషణం,సూపర్‌వైజర్ సారయ్య, శశి, మాజీ కౌన్సిలర్ రాజిరెడ్డి, గుండేటి రాజేశ్ ,శంకర్‌నాయక్ ఉన్నారు.

సర్వే నమోదుకు ప్రత్యేక కేంద్రం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సామాజిక కుటుంబ సర్వేలో భాగంగా నమోదు చేసుకోని వారి కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో దివ్యాదర్శన్‌రావు తెలిపారు. ఈనెల 28 వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాసులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ఎలిగేడు, ఫిబ్రవరి 13 : ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు పొన్నం కనకమ్మ(78) ఎస్సారెస్పీ డి 86 ప్రదాన కాలువలో శనివారం మధ్యాహ్నం పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జూలపల్లి ఎస్సై సనత్ కుమార్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నం కనుకమ్మకు భర్త 30ఏండ్ల క్రితం చనిపోగా ముగ్గురు పిల్లల్ని ఆమె పోషించింది. ఈ క్రమంలో దాదాపు మూడేళ్ళ నుంచి మతిస్థిమితం సక్రమంగా లేక తనకు బతకాలని లేదని ఇరుగుపొరుగు వారికి చెప్పేది. ఈక్రమంలో జీవితం పై విరక్తి చెంది ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అదే సమయంలో అటువైపు వెల్తున్న ఉపాధ్యాయుడు అదేగ్రామానికి చెందిన కొండా తిరుపతి గౌడు ఆమె ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేశారు .అయినప్పటికి ఆమె కొద్దిసేపటికి ఊపిరి ఆడక తనువు చాలించింది. కనుకమ్మ కొడుకు పొన్నం మల్లయ్య పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

బొగ్గు రవాణాను పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 సీహెచ్‌పీ నుండి అత్యధిక రేకులను రవాణా చేయాలని సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్‌వీ సూర్యనారాయణ అధికారులకు సూచించారు. శనివారం ఓసీపీ-3 సీహెచ్‌పీని ఎన్‌టీపీసీ రైల్వే అధికారులతో ఆకస్మికంగా సందర్శించారు. రైల్వే రేకుల రవాణాను పెంచేందుకు రైల్వే అధికారులతో మాట్లాడారు. అనంతరం బంకర్స్, సీహెచ్‌పీలో ఉన్న బొగ్గు నిల్వలపై అడిగి తెలుసుకున్నారు. రవా ణాకు అనుగుణంగా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులకు సూచించారు. తొలిసారి సీహెచ్‌పీని సందర్శించిన సందర్భంగా ఆయనను సన్మానించి పూలబోకే అందజేశారు.ఆయన వెంట సౌత్ సెంట్రల్ రైల్వే ఎసీఎం జీ. సుచరిత రెడ్డి, ఎఓ రాజేష్ మీనా, ఇన్‌చార్జి జీఎం మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరిసింహారావు, సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందం ఉన్నారు.

పనిముట్లు ఇవ్వరు.. పనులు చేయించుకుంటరు

మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు మురళీధర్ రావు

- బల్దియా అధికారుల తీరుతో మానసిక క్షోభ అనుభవిస్తున్నాం
- మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల జేఏసీ ఆగ్రహం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: రామగుండం నగర పాలక సంస్థ అధికారుల పనితీరుపై కాంట్రాక్ట్ కార్మికులు తమ ఆవేదనను ఏకరువు పెట్టారు. పని ముట్లు ఇవ్వరు... పనులు మాత్రం చేయమంటారు... అడిగితే పని ఒత్తిళ్లకు గురి చేయడంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నామంటూ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గోదావరిఖనిలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో అధికారుల నిర్లక్ష్యం, వేధింపులను ఎండగట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మురళీధర్ రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావులు హాజరై మాట్లాడారు. కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులపై అధికారులు కొంత కాలంగా కక్షసాధింపు ధోరణి అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. చీపుర్లు, పారలు, గంపలు, రక్షణ పరికరాలు చెప్పులు, మాస్కు లు, గ్లౌజులు, బెల్లం, సబ్బులు, కొబ్బరినూనె ఇవ్వకుండా పనులు చేయిస్తున్నారన్నారు. కమిషనర్ బదిలీ అనంతరం ఇప్పటివరకు నూతన కమిషనర్‌ను నియమించలేదని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమ సమస్యలు విన్నవించుకోవడానికి వెళ్లితే సమయం కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వై.యాకయ్య, ప్రధాన కార్యదర్శి జనగామ రాయమల్లు, జిల్లా అధ్యక్షుడు కుమార్, నాయకులు కిషన్ నాయ రాధాకృష్ణ, నాగమణి, సార య్య, సునీత, రామలక్ష్మి, పోచమ్మ, బోయి ని రవీందర్, లింగయ్య, రాజేందర్, రాయమల్లు, రూప, పద్మ, లత, లక్ష్మీతోపాటు 300 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత

రామగిరి, ఫిబ్రవరి 15: సెంటినరీకాలనీకి చెందిన ఉడుత సంతోష్, బండి రమాదేవిలకు కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి బీమా చెక్కులు మంజూరయ్యాయి. బ్యాంకు మేనేజర్ ఎల్ గాంధీ నాయక్ ఈ మేరకు శనివారం ఖాతాదారులకు ఆ చెక్కులను అందజేశారు. పీఎం జేజేబీవై స్కీం ద్వారా ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున బీమా మంజూరైందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ పీఎంజేజేబీవై ద్వారా రూ.436, పీఎంఎస్‌బీఐ ద్వారా రూ.20 ఇన్సురెన్సు చేసుకోవాలని తెలిపారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఫ్‌డీలపై వస్తున్న వడ్డీ శాతం గురించి వివరించారు. సీనియర్ సిటిజన్‌లకు 8.10 శాతం, సాధారణ ఖాతాదారులకు 7.6 శాతం వడ్డీ బ్యాంకు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారెంట